

# బాండెడ్ లేబర్

## పి. సుబ్రహ్మణ్యం

**దూరం నుంచి** లీలగా ఒక సన్నని ఆకారం ముందుకు వస్తూంది. గంటకు మూడు మైళ్ళ వేగంతో నూడు వందల వంకరలతో సామ్రాజ్యం పోగొట్టుకున్న రాజకుమారుడిలా ఒక అరగంట సేపట్లో తలుపు ల్లేని తాలూకాఫీసు ప్రహరీ గోడల్ని దాటుకుని లోపలికి ప్రవేశించిం దా ఆకారం. ఎదుగూ బొదుగూ లేని పేరు గొప్పదని పించే రెవెన్యూ డిపార్టుమెంటులో ఇరవై అయిదేళ్ళ నుంచి అదే కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడే ఎల్. డి. గుమాస్తా సుందరరావే ఆ ఆకారమని కొత్తవాళ్ళ కేం తెలుసు?

అతను కూర్చునే కుర్చీ మూడు కాళ్ళ దయింది. దాని కున్న రెండు హాండ్సు పోయాయి. టేబు లంతా నీళ్ళు లేని బావుల్లాగా పెద్ద పెద్ద గుంటలు పడ్డాయి. దానితోపాటు సుందరరావు కళ్ళు గుంటలు పడ్డాయి కాని దిక్కుమాలిన ప్రమోషను ఇంకా రాలేదు. అతని పేరు ఎంత అందంగా ఉంటుందో, రూపం దాని కంత వ్యతిరేకంగా ఉంటుంది.

“సార్, తమర్ని అయ్యగారు రమ్మంటున్నారు” అన్నాడు బంట్రోతు నారాయణ, సదరు సుందర రావు స్టాండు లేని సైకిలును గోడకు ఆనించే లోగానే.

సుందరరావు వెనక సీటులో ఫైళ్ళు కట్టి ఉన్న పాడ్ చేతికి తీసుకుని లోపలకు ప్రవేశించి తహసీల్దారు గారికి సాష్టాంగ దండ ప్రణామాన్ని మించే విధంగా ‘నమస్కారం’ చేశాడు. సెకండుకు రెండు సంతకాలు చొప్పున టేబిలు మీద రెండు వైపులా ఎత్తుగా పోటీల మీద పెరిగిన ధరల్లా ఉన్న ఆ సైనుమెంటు: పట్టాల మీద బరబరా గీకేస్తున్న సదరు తహసీల్దారు గారు తలెత్తకుండానే, “కాన్ఫరెన్సు పర్టిక్యులర్సు తయారయ్యాయా” అన్నాడు.

“అయ్యాయి, సార్.”

పక్కనే వెదురుగడలను క్రమపద్ధతిలో ఉంచి, నాటికి పాంటు, షర్టు తొడిగినట్టున్న యు. డి. గుమాస్తా శంకరరావు బైనాక్యులర్సు లాంటి అద్దా ల్లోంచి ‘రక్షించ బడ్డావు’ అన్నట్లు సుందరరావు వైపు చూశాడు.

సుందరరావు బోనులోంచి తప్పించుకున్న పులిలా చప్పుడు కాకుండా అక్కడ నుంచి బయట పడ్డాడు.


“సార్! తహసీల్దారుగారు మీకు కాన్ఫరెన్సు పర్టిక్యులర్సు ఇవ్వమన్నారు.”

‘కాన్ఫరెన్సేమిటి? పర్టిక్యులర్సేమిటి?’ ఎగిరి పడ్డాడు హెడ్‌క్లర్కు, తిట్టడానికి అవకాశం ఏముందా అని ఒక వైపు ఆలోచిస్తూనే.

“అదే, సార్! నిన్న సర్క్యులర్ పంపించారు గదా, ఈ రోజు సాయంత్రం రెవెన్యూ మినిస్టరు మన తాలూకాను విజిట్ చేస్తున్నారని. అందుకుగాను నా సీటుకు సంబంధించిన ఇన్ఫర్మేషను ‘బాండెడ్ లేబర్’ మీద వ్రాసుకొచ్చాను.”

“హుః. అక్కడ పెట్టి వెళ్ళు.” వెధవ బుర్ర. వీడిని తిట్టడానికి ఏ పాయింటూ తట్టడం లేదు. నా కంటే పదేళ్ళు సర్వీసు ఎక్కువయినంత మాత్రాన నాకు నమస్కారం పెట్టాల్సిన విషయం తెలియదూ? ఎంతైనా వాడు ఎల్. డి. గుమాస్తా. నేను హెడ్ గుమాస్తాను. ఈ నాటి కుర్రాళ్ళలా తయారవు తున్నాడు. అయినా ఎక్కడకు పోతాడులే!” మనసులోనే అనుకున్నాడు హెడ్ క్లర్కు భజగోవిందం.

ఇతనికి తనని గురించి పదే పదే భజన చేస్తుంటే భలే ఆనందపడి పోతూంటాడు. వెళుతున్న సుందర




రావును మళ్ళా పిలిచాడు.

"ఇదిగో! ఆఫీసుకు రావాల్సిన టైమెంత?"

"ఉదయం పదిన్నర గంటలకు రావాలి, సార్."

"మరిప్పుడు టైమెంత?"

"తొమ్మిది కావస్తూంది, సార్."

"అయితే ఇప్పుడా వచ్చేది?"

"నేను ఏడు గంటలకే వచ్చాను, సార్! తహసీల్దారు గారు మినిస్టరుగారికి బంగ్లా ఏర్పాట్లు చూడమన్నారు. అక్కడ కాస్త ఆలస్యమయింది."

"నువ్వెన్నయినా చెప్పు. ఇది రెవెన్యూ డిపార్టుమెంటు. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు...మరలా సాయంత్రం ఆరు గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు మొత్తం ట్వంటీఫోర్ అవర్సు డ్యూటీ చేయవలసి ఉంటుంది. అప్పుడే నీకురావలసిన జీతం నాలుగు కాసులావస్తాయి' మనిషన్న తరవాత సిన్సియర్‌గా ఉండాలోయ్.' ,

"అలాగే, సార్" అంటూ వెనకకు తిరగ బోయాడు సుందరరావు.

"ఇదుగో, సుందర్రావ్. సిన్సియారిటీ గురించి ఒక ఉదాహరణ చెపుతా, విను ... ఒకప్పుడు కలెక్టర్ గారు బంగాళాఖాతం అంచునే ఉన్న ఒక పట్నపు పాలెం విజిట్ చేశారు. కలెక్టర్ దొరవారు గదా అని మంచి ఆర్భాటం చేశారు. సముద్రం అంచునే షామియానా వేసి పందిరి తయారు చేశారు. కలెక్టరు, ఆయన ప్రక్కనే పి. ఏ., కలెక్టరు కెదురుగా తహసీల్దారు కూర్చున్నారు. మిగతా ప్రజలంతా నిలబడి ఉన్నారు. సముద్రపు పిల్లగాలులు వారిశరీరాల్ని స్పృశిస్తున్నాయి. సముద్రపు అలలు వారికి సమీపంగా వచ్చి వెనక్కు పోతున్నాయి.

మాట్లాడుతూ, మాట్లాడుతూ ఉన్నట్టుండి సీరియస్‌గా 'ఈ బంగాళాఖాతంలో దూకండి' అన్నాడు కలెక్టరు.

'అలాగే, సార్' అంటూ అప్పటికే తహసీల్దారు గారు 'ఎందుకు దూకమన్నాడు బంగాళాఖాతంలో? ఎందుకు దూకాలి?' అని కూడా ఆలోచించకుండా నిలువెత్తు అలలతో భయంకరంగా గర్జిస్తున్న బంగాళాఖాతంలో గభీమని దూకేశాడు. 'సిన్సియారిటీ అంటే అదోయ్, సుందర్రావ్." ఊపిరి పీల్చుకున్నాడు హెడ్ క్లర్కు, ముక్కు ఎగబీల్చి కొద్దిగా నశ్యం ఎక్కిస్తూ.

"తరవాత ఏమయింది, సార్" అన్నాడు సుందర రావు ఆత్రతగా.

హెడ్ క్లర్కు చిరుమందహాసం చేశాడు. "అసలు నిజానికి కలెక్టరుగారు అన్నది అది కాదోయ్ ... గవర్నమెంటు మీకు ఇండ్లు కట్టించమని లక్ష రూపాయలు గ్రాంటు చేసింది. మేము మీ ఊరికి వస్తున్నామని తెలిసి కూడా అందరూ చేపలు పట్టడానికి వెళితే మేమిచ్చే సహాయం మీ కెలా అందుతుంది ... ఎప్పుడైనా తుఫాను వస్తే అందరూ సముద్రంలో కొట్టుకుపోతారు. అందుకని ఇప్పుడే బంగాళాఖాతంలో దూకండి అని జాలర్ల నుద్దేశించి కోప్పడి, తహసీల్దారువైపు తిరిగి 'ఏమంటారు' అన్నాడు. అంతే! ఏదో ఆలోచిస్తున్న తహసీల్దారు చివరి మాటే విన్నాడు. 'అలాగే, సార్' అంటూ బంగాళాఖాతంలో దూకేశాడు ..."

"తరవాత, సార్ ..." సుందరరావు ఒక చేత్తో ముఖం మీద చెమట తుడుచుకొంటూ ఆత్రతగా అడిగాడు.

"తరవాత ఏముంది? కలెక్టరుగారితో సహా అందరూ భయపడ్డారు. ఆరితేరిన జాలర్లు తహసీల్దారుగారిని రక్షించారనుకో" అన్నాడు హెడ్ క్లర్కు.

"ఇంతకీ నే చెప్పేదేమిటంటే, మర్యాద నేర్చుకో. సిన్సియర్‌గా ఉండు అంటాను. రాగానే తహసీల్దారు గారికి, డిప్యూటీ తహసీల్దారుగారికి, తరవాత నాకు గుడ్‌మార్నింగ్ చెయ్—బాగుపడతావు."

"సరే, సార్! తమరు చెప్పినట్లే చేస్తాను." సీట్లో వచ్చి కూలబడ్డాడు. తనేం తప్పు చేశాడని ఇన్ని చెప్పాడు? ఎప్పుడూ తను అందరికీ గుడ్‌మార్నింగ్ చెప్పేవాడు. కాని ఈ రోజు కాన్ఫరెన్సు హడావుడిలో పడి...!

బీరువా తెరచి బాండెడ్ లేబర్‌కు సంబంధించిన ఫైళ్ళు వరుసగా టేబులుమీద ఉంచాడు. ప్రస్తుతం వాటిలో దాదాపు పది కేసుల మీద యాక్షన్ జరుగుతున్నది. తరతరాల నుంచి వూడిగం చేస్తూ బానిస బ్రతుకులు గడుపుతున్న బీద ప్రజలకు విముక్తి కలిగించడం, వారికి ఆర్థిక స్థిరత్వం కలిగించి, సమానత్వం కోసం కృషి చేయడం ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న పని.

"సార్! తమర్ని హెడ్ క్లర్కు అయ్యగారు రమ్మంటున్నారు." ప్యూను నరసింహులు చెప్పాడు.

"వస్తున్నా" అన్నాడు ఫైళ్ళు సర్దుతూ.

రెండు నిమిషాల తేడాలో "తమర్ని దొరగారు రమ్మంటున్నారు" అని తహసీల్దారు జవాను పీరుసాహెబు వచ్చాడు.

"ఇదుగో, వస్తున్నా" అంటూ మొదట హెడ్ క్లర్కు దగ్గరకు బయలుదేరాడు. హెడ్ క్లర్కు సీటులో లేడు.

నేరుగా తహసీల్దారు దగ్గరకు వెళ్ళి చేతులు వెనక్కు కట్టుకుని వంచిన విల్లులా నిలబడ్డాడు.

అక్కడే ఉన్న హెడ్ క్లర్కు భజగోవిందం విషపు నవ్వొకటి నవ్వి, 'అనుభవిస్తూ ఉండు' అన్నట్టు విలన్ చూపొకటి విసిరాడు.

"ఏమయ్యా? కాన్ఫరెన్సు పర్టిక్యులర్సంతా తప్పేడు లెక్కలేనా? ఇది మినిస్టరు చూసే దనుకున్నావా, లేక రామాపురం వెట్టివాడు చూసే దనుకున్నావా?" అన్నాడు తహసీల్దారు.

"నే వేసినదాంట్లో తప్పేమీ లేదు, సార్! కావాలంటే ఫైల్సు అన్నీ తమరి దగ్గరకు తీసుకొస్తాను. మొదటి నుంచీ కూడా ఇదే ఫిగర్ వేస్తున్నాం."

"ఆరి సరేలేవోయ్! మొత్తం నలభై ఎనిమిది బాండెడ్ లేబర్ కేసులు ఉన్నాయి. అందులో పది కేసుల మీద మాత్రం యాక్షను తీసుకున్నట్లు, మిగతా ముప్పై ఎనిమిది కేసులు బాలెన్సు చూపించావు. అవునా!"

"అవును, సార్."

"అదే మన కలెక్టరూ, డిప్యూటీ కలెక్టరూ అయితే అందులోని సాధక బాధకాలు తెలుసు కాబట్టి పైకి లెట్టినా కాగితం మీద పెట్టరు. అదే మినిస్టరుకు ముప్పై ఎనిమిది కేసులు పెండింగు చూపిస్తే నే నెక్కడ ఉంటాను? ఏ అడవుల్లో జంతువులమీదనో, సముద్రంలో చేపల మీదనో తహసీల్దారుగా వేస్తాడు... అవునా! ..."

"చిత్తం, సార్."

"అప్పుడు నేనేం చేస్తాను? క్లర్కు సరిగా చేయడం లేదని నీకు చార్జి మెమో ఇచ్చి నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తాను. తరవాత నేను ఫలితం అనుభవిస్తాను. కాబట్టి అన్నీ సక్రమంగా జరగాలంటే మన హెడ్‌క్లర్కు చెప్పినట్టు చెయ్ ... ఇక వెళ్ళు."

'ఏరేమనుకున్నావు నా తడాఖా' అన్నట్టు చూశాడు హెడ్‌క్లర్కు. సినిమాల్లో హీరో రాక్షసుణ్ణి చెట్లతో, కొండలతో పోరాడి చంపేస్తే శవం పొట్ట మీద కాలుపెట్టి, మీసం మెలివేసిన అంజిగాడిలా ఉన్నాడు.

"సార్, తమరు ఏం చెయ్యమంటారో చెప్పండి?" సీట్లో కొచ్చిన తరవాత అడిగాడు హెడ్‌క్లర్కుని.

హెడ్‌క్లర్కు ఒక్కసారి తల విదిలించి, నశ్యం పీల్చి, బాటరీ చార్జి చేసుకున్న తరవాత సుడిగాలిలా నెత్తికు వచ్చిన తుమ్మును కంట్రోలు చేసుకోలేక, టేబిలు మీద కాగితాలు నాలు గంసులాలు లేచేట్లు ఒక తుమ్ము తుమ్మి సర్ది కూర్చున్నాడు.


"ఉదయం నుంచి చూస్తున్నాను. ఒక్క పార్టీ రావడం లేదోయ్. గొంతు ఎండుకు పోతున్న దనుకో."

సుందరరావుకు పరిస్థితి అర్థమయింది. జేబు లోంచి అయిదు పది పైసల బిళ్ళలు ఏరి ప్యూనును ఒక కాఫీ తెమ్మన్నాడు.

"అదేమిటోయ్! నా కొక్కడికే తెప్పిస్తున్నావ్. మరి నువ్వు తాగవేంటి?" నవ్వాడు.

"దాందేముంది లెండి, సార్! తమరు పెద్దవాళ్ళు. ఎంతైనా మేము మీ తరవాత వాళ్ళమే కదా."

"అరె! సుందర్రావ్! నీ కింత అమోఘమైన తెలివి తేటలు, అణకువ ఉన్నాయని నేను కల్లోకూడా అనుకోలేదోయ్! తొందరలో పైకొస్తావ్. నీ




కంటే వయసులో చిన్న వాళ్ళమయినా ఉద్యోగంలో నీ కంటే పెద్దవాళ్ళమయిన మమ్మల్ని గౌరవించడం తెలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు భజగోవిందం ప్యూను చేతిలోంచి తీసుకున్న కాఫీ చప్పరిస్తూ.

"అయ్యా! తమర్ని చిన్నదొరగారు కావ్వరెన్సు ఫైలు తెమ్మంటున్నారు." హెడ్ క్లర్కు నుద్దేశించి అన్నాడు డిప్యూటీ తహసీల్దారు జవాను రాఘవులు.

"బోడి ఎవరయ్యా ఆ డిప్యూటీ తహసీల్దారు? చిన్నగాక మొన్న వచ్చిన ఆ కాలేజీ బుజ్జబ్బాయేనా! మొత్తం నా కాజువల్ లీవంత సర్వీసుందో లేదో నన్నే ఫైలు తెమ్మంటాడూ? ఏం తెల్సని? నేను లే నన్నానని చెప్పు పో." రౌద్రంగా అరిచాడు హెడ్ క్లర్కు, తన వయసుకు గుర్తుగా చెంపల మీదున్న తెల్ల వెంట్రుకలను ప్రక్కకు నెట్టుకుంటూ.

"అలాగే, సార్." కీ ఇచ్చిన బొమ్మలా వెనక్కు తిరిగాడు రాఘవులు. పులిలా గాండ్రించిన హెడ్ క్లర్కు మరు క్షణంలో పిల్లిలా మ్యావ్ అంటూ ఏడ్చాడు. "ఒరేయ్, రాఘవులూ, నిజంగా చెప్ప బోకురా. నేను బి. పి. లో ఏదో అన్నాను. ఆయ

నెక్కడా, నే నెక్కడా! ఆయన ప్రొబేషనరీ డిప్యూటి తహసీల్దారు. రెండేళ్ళలో తహసీల్దారు. నాలుగేళ్ళలో డిప్యూటీ కలెక్టరు అవుతాడు. నేనా హెడ్‌క్లర్కుగా రిటైరయ్యేవాణ్ణి. తరవాత నా ఎముకలు ఏరేస్తాడు. ఒరేయ్, రాఘవులూ! నీవు వెళ్ళకు. ఇక్కడే ఉండు. నేనే వెళ్ళి చిన్నదొరగారికి కనిపిస్తాను. ఇదిగో—ఈ రెండు రూపాయ లుంచుకో" అంటూ రాఘవులు చేతిలో ఒక రూపాయ ఉంచాడు.

రాఘవులు చేతిలోని నోటును అటూ ఇటూ త్రిప్పి చూశాడు. "నురేం అనుకోకు—ఒక్కసారిగా రెండు రూపాయలు ఇవ్వాలంటే నాకు జ్వరం వస్తుంది. రేపొక రూపాయ ఇస్తాన్లే?" అంటూ, "అయ్యా, సుందరరావ్, పరిస్థితులు బాగా లేవు, నాయనా! ఇదిగో నీ కాఫీ డబ్బులు. అదిగో నీ విచ్చిన నోట్సులో బాలెన్సు ముప్పై ఎనిమిది కేసులని, యాక్షను పది కేసులనిపాత వ్మాత్రమే జరిగిందని వ్రాశావు. అది అలా తిప్పి ముప్పై ఎనిమిది కేసుల

మీద యాక్షను తీసుకున్నట్లు, పది కేసులు పెండింగులో ఉన్నట్లు వ్రాసి సంతకం పెట్టు. ఇదే తహసీల్దారు దొరగారు చెప్పింది. సందేహించకు, నాయనా! అవతల నా ప్రమోషను ఆగిపోద్ది." హడావుడిగా కాగితాలు తీసుకుని హెడ్‌క్వార్టర్సు డిప్యూటీ తహసీల్దారు రూము వైపు ఎగిరాడు భజగోవిందం.

సుందరరావు తన సీట్లో కూర్చుని ఆలోచించసాగాడు. తనిప్పుడు ఇచ్చిన తప్పు ఫిగర్ మినిస్టరు గారికి అర్థం కాకపోయినా, కలెక్టరుగారికి తప్పక అర్థమవుతుంది. తహసీల్దారు తప్పు తన మీదకు నెట్టేస్తాడు. తన ఉద్యోగం పోతుంది. నిజానికి ప్రపంచమే మోసం. బీరువా తెరిచి ఫైళ్ళు టేబులు మీద వేశాడు.

"సార్! మీ అర్జంటు టపాలు తీసుకోండి" అంటూ ఒక ఇరవై కాగితాలు మడిచి టేబిలు మీద పెట్టాడు టైపిస్టు.

'ప్రతిదీ అర్జంటే. వీటిలో సగం వాటికైనా జవాబు వ్రాయాలి' అనుకుంటూ వాటిని వాటికి సంబంధించిన ఫైళ్ళలో వాటిని ఉంచసాగాడు.

"సార్, తమర్ని చిన్నదొరగారు రమ్మంటున్నారు." పిలిచాడు రాఘవులు.

"ఇదిగో వస్తున్నా" అంటూ కొద్ది సేపట్లో డిప్యూటీ తహసీల్దారు కెదురుగా నిలబడ్డాడు.

"సుందర్రావుగారూ! మీరు కూర్చోండి." కుర్చీ చూపించాడు డిప్యూటీ తహసీల్దారు.

"ఫరవాలేదు, సార్."

"ఫరవాలేదు ఏమిటండీ! ఇక్కడ అందరూ సమానమే. ముందు కూర్చుని మాట్లాడండి."

"ఏమిటండీ! మీ నోట్సు అంతా తప్పుడు లెక్క వేశారు—పోయిన నెలకు, ఈ నెలకు ఇంత తేడానా?"

మెత్తని సోఫాలో కూర్చోపెట్టి తెగిపోయిన పాత చెప్పుతో కొట్టి నట్లయింది సుందరరావు పని. కొద్దిసేపు నీళ్ళు నమిలాడు. ఏం చెప్పాలి? ఏం చెప్పినా తప్పు తనదే అవుతుంది. తహసీల్దారు ఈ పని చేయమన్నాడని చెప్పగలడా!

"హెడ్‌క్లర్కు వెయ్యమంటే వేశాను, సార్."

"హెడ్‌క్లర్కు ఏం చెయ్యమంటే అది చేస్తారా! ఇంకో నెల పోతే అసలు కేసుల్లో పెండింగులే లేవని వ్రాస్తారు. నిజం తెలిస్తే ఎవరి పరువు పోయేది? మన వాళ్ళకు అది అలవాటే. మా దేశం ఇంత గొప్ప, అంత గొప్ప అని ఇతర దేశాల్లో చెప్పుకుంటారు. తీరా వాళ్ళు వచ్చి చూస్తే బస్సు స్టాండుల్లో డజన్ల మంది బిచ్చగాళ్ళు...దేవాలయాల్లో వందల కొద్దీ ముష్టి వాళ్ళు. ఇక రైళ్ళలో టికెట్‌లెస్ ట్రావెలర్స్ వేల కొద్దీ ఉన్నారు. ఇక బజార్లలో చూద్దామా అంటే నడిచే ప్రతి ఇద్దరిలోనూ ఒకడు కటిక దరిద్రుడు. ఇట్లా ఉందయ్యా సిరిసంపదలతో తులతూగే భారతదేశం..."

"నే చెప్పే దేమంటే, మనమంతా గవర్నమెంటు సేవకులం. గవర్నమెంటు ఏదో జీతం ఇస్తుంది కాబట్టి మనం దానికి సమానంగా సేవ చేయాలి. ఇలా మనల్ని మనంమోసం చేసుకొంటూ ఉంటే ఎప్పటికే దెవరయ్యా అంటే మన జీతాల్ని పన్నుల రూపంలో చెల్లించే ప్రజలు..." ఆవేశంతో ఊగిపోయాడు కుర్ర ఆఫీసర్.

"హెడ్ క్లర్కు నాకేం తెలియదంటున్నాడు. దీనికి మీ జవాబేమిటి?" అన్నాడు డిప్యూటీ తహసీల్దారు.

"చిత్తం" అన్నాడు ప్రక్కనే ఉన్న హెడ్ క్లర్కు. సుందరరావు దృష్టికి పురాణాల్లో విన్న కలహభోజుడు నారదుడులా కన్పించాడు. అన్నీ చేసి చివరకు నాకేం తెలియదు అంటున్నాడు.

సుందరరావుకు ఏం చేయాలో తెలియడంలేదు. గంట కొట్టి, గంటయినా రాని రైలులా అతని నోట్లోంచి మాట రావడంలేదు. చివరకు "దాన్ని సరిచేసి ఇస్తాను, సార్" అని మాత్రం అనగలిగాడు.

"ఇంతే మిస్టరయ్యా! ఒరిజినలు కాపీ పెద దొరగారి దగ్గరుంది. కార్బను కాపీలే మన దగ్గరుండేది! కాబట్టి ఇకనుంచైనా జాగ్రత్తగా ఉండమంటున్నారు చిన్న దొరగారు." రెండు పిల్లుల్లోకి రాజీ చేసిన ధోరణిలో అన్నాడు.

"అనవసరంగా మాట్లాడకండి, హెడ్ క్లర్కు గారూ! మీరుండేది దేనికి అంటాను. ఈ విషయాలన్నీ మీరు చూసి కదా టైపుకు పంపాల్సింది?

పిల్లి కళ్ళుమూసుకుని పాలు త్రాగుతూ 'తన నెవ్వరూ చూడలేదనుకొంటుంది. నా ఆఫీసులో ఎవరు ఏమేం చేస్తున్నది ఎప్పటికప్పుడు తెలుస్తూ ఉంటుంది...''

''ఇక వెళ్ళొచ్చు'' అన్నాడు. సుందరరావు వెళ్ళి తన సీట్లో కూర్చొన్నాడు.

ఫైలు తీసి చదువసాగాడు ... పెద్దయ్యగారు రమ్మంటున్నారు.'' పీరు సాహెబు పిలుపుకు తలె త్తాడు. ఫైలు కట్టి తహసీల్దారు కెదురుగా నిలబడ్డాడు.

''ఏమయ్యా?... నేన్ని సేవ్ సైడ్ కోసం చెప్తే తప్పుడులెక్క నీచేత చెప్పి చెయ్యించానని డిప్యూటి తహసీల్దారుతో చెబుతావా...అసలు నీకు తహసీల్దారొక డున్నాడనయినా గుర్తుందా...నే ననుకొంటే నీ ఇంక్రిమెంటు కట్ చేస్తాను...ఈ అడ్మినిస్ట్రేషన్‌లో డిసిప్లిన్ లేకుండాపోయింది. ఛీ—ఛీ—ఎం మనుషులో జీతం తేరగా వస్తుంది కాబోలు...''

భారంగా వచ్చి సీట్లో కూర్చొన్నాడు. టైమ్ చూస్తే మూడున్నరయింది. ఈ హడావుడిలో మధ్యాహ్నం భోజనానిక్కూడా వెళ్ళలేదు. లేద్దామనుకొంటూండగా పీరు సాహెబు పరుగెత్తుకొని వచ్చాడు. ''సార్, తమర్ని బంగళా దగ్గరకు వెళ్ళి అరేంజిమెంట్సు చూడమన్నారు, అయ్యగారు. చిన్నయ్యగారు జీపులో వస్తారట!''

సుందరరావు చుట్టూ చూశాడు. గుమస్తాలలో చాల మంది బాతాఖానీలు వేసుకొంటున్నారు. తహసీల్దారు ఏదయినా పని చెపితే నిర్లక్ష్యంగా ఎగగొడతారు. వాళ్ళంతా అంతో ఇంతో ఇన్‌ఫ్లుయన్సు ఉన్న వారు. ఇద్దరు మినిస్టరు తాలూకు మనుషులు. మరిద్దరు పై లెవల్లో పలుకుబడి ఉన్నవారు. ఇంకొకాయన తహసీల్దారు అప్ప కొడుకు. వీరిని ఏమన్నా అనాలంటే తహసీల్దారుకు చాల భయం. మొదటిది తన ఉద్యోగం ఏమవుతుందో ననేది. రెండవది—తన మాటలు వారు ఖాతరు చెయ్యకపోతే పరువు పోతుందని. ఇక పోతే మిగతా తనలాటి గుమాస్తాలు ఇల్లా వాకిలి వదులుకొని గొడ్డులాగా చాకిరీ చేస్తూనే ఉన్నారు.

తనేమన్నా ఎదిరిస్తే ఉన్నదీ లేనిదీ కలిపి కలెక్టరుకు పని చేయడంలేదని రిపోర్టు చేస్తారు. దాంతో తనను ఎక్కడికో ట్రాన్స్‌ఫర్ చేస్తారు. చాలీ చాలని జీతంతో ఉన్న వూళ్ళోనే బ్రతకలేని తను వేరే వూళ్ళో అద్దె కొంపలో సంసారం ఈదగలడా? అందుకే తన వీక్‌నెస్ గుర్తించి పిల్లిలా ఆటాడుతున్నారు.

సుందరరావు ట్రావెలర్సు బంగళా ముందున్న టీ కొట్లో ఒక కప్పు 'టీ' త్రాగి గేటు ముందు తచ్చాడసాగాడు. ఆరు గంటల ప్రాంతంలో తహసీల్దారు డిప్యూటీ తహసీల్దారు ఒక సారి వచ్చి చూసి 'కలెక్టరాఫీసునుంచి మినిస్టరు రావటంలేదంటూ ఫోనొస్తే తమకు తెలియజేయ' మని చెప్పి వెళ్ళిపోయారు.

రాత్రి పది గంటల సమయంలో రెవెన్యూ మినిస్టరుగారు ఆ రోజుకు రారని, మరునాటి రోజు ఉదయం తొమ్మిది గంటలకు రాబోతున్నారని కలెక్టరాఫీసు నుంచి ఫోనొచ్చింది. వెంటనే తాలూకాఫీసు వైపు బయలుదేరాడు సుందరరావు.

''సార్!...పెద్దమ్మాయిని చూడ్డానికి వస్తున్నారు. రేపు ఒక గంట పర్మిషనివ్వండి'' నసుగుతూ రిక్వెస్టు చేసుకొన్నాడు సుందరరావు.

తహసీల్దారు జీపులో కూర్చొన్న వాడల్లా తల బయటపెట్టాడు. ''మిస్టర్ సుందరరావ్! నీవు ఉదయం నుంచి ఎన్ని కాగితాలు వ్రాశావ్'' అన్నాడు.

సుందరరావుకు షాక్ తిన్నట్లయింది. తనకు ఉదయం నుంచి ఇప్పటి వరకు అటూ ఇటూ తిరగనే సరిపోయింది. ఇక ఏం వ్రాస్తాడు?

''చిత్తం ... ఏం వ్రాయలేదు, సార్.''

''ఈ రోజు నీ కూలి పాటు గూడా గిట్టుబాటు లేదు కదయ్యా? ఏం చేశావని రేపు పర్మిషను కావాలి నీకు? అడగడానికి సిగ్గెట్లా లేదయ్యా? పర్మిషను లేదు. గిర్మిషను లేదు ... రేపు ఉదయం ఎనిమిది గంటల కల్లా ఆఫీసులో లేకపోతే పనిష్‌మెంటు మాత్రం ఉంటుంది. డ్రైవర్! పోనియ్'' అన్నాడు.

సుందరరావు ఇల్లు చేరుకునేసరికి అందరూ నిద్రపోతున్నారు. విరిగిపోయిన గుంజ నానుకొని తెగిపోయిన గాలిపటంలా వూగుతోంది సావిత్రి. భోజనం అయిందనిపించి కుమార్తె ముఖంలోకి ఒకసారి చూశాడు. అమాయకంగా చెల్లెలి నడుం మీద చేయివేసి నిద్రపోతోంది. ఒక మంచం మీద తండ్రి, ప్రక్కనే చాప పరచుకొని ముసలి తల్లి నిద్రపోతున్నారు. మిగతా ముగ్గురు పిల్లలూ లావుపాటి జంపఖానా మీద అస్తవ్యస్తంగా దొర్లుతున్నారు.

సావిత్రి తూగుతూ మర్నాటి కార్యక్రమం గురించి ఏదేదో చెబుతూ ఉంది. సుందరరావుకు అవేవీ వినిపించడం లేదు. తనకు ఈ రోజు జరిగిన అవమానం గురించి, ఒక రోజు కూడా సెలవు దొరకని తన జీవితం గురించి ఆలోచిస్తున్నాడు.

దూరంగా మైక్‌లోంచి ఏదో సినిమాలో పాట వినిపిస్తూ ఉంది. ''లగిజిగి ... లగిజిగి ... ఎదురు తిరగరన్నా... నువ్వు ఎదురుతిరగ రన్నా ...'' ఆ పాటే అతని జీవితంలో ఎన్నో అద్భుతమైన మార్పులను తెస్తుందని ఆ క్షణంలో వూహించలేకపోయాడు.

తన మెతకదనం చూసి ఆఫీసర్లు నెత్తిన మొట్టుతున్నారు. లేకపోతే నిన్నగాక మొన్న వచ్చిన గుమాస్తాలు పని ఎగ్గొట్టి తిరుగుతూ ఉంటే, తనింత కష్టపడి పనిచేసి సీనియర్ల దగ్గర తిట్లు తింటున్నాడు. గవర్నమెంటు రూల్సు అంటూ కొన్ని ఉన్నాయి. కాబట్టి రేపట్నుంచి వాటినే తను ఫాలో అయితే సరిపోతుంది. ఏమవుతుందో చూస్తాం అనుకొన్నాడు. ఆ నిర్ణయానికి రాగానే తృప్తిగా నిద్రపట్టింది సుందరరావుకు.

మరునాటి రోజు కావాలనే పట్టుదలగా ఎనిమిది గంటలకు నిద్రలేచాడు. పెద్ద అమ్మాయిని పరామర్శించాడు. పిల్ల లిద్దర్నీ దగ్గరుండి స్కూలుకు పంపేడు. చిన్నపిల్లనూ, ఉంటివాణ్ణి ఆడిస్తూ గడిపాడు. తలిదండ్రుల యోగక్షేమాలు దగ్గరుండి కనుక్కొన్నాడు. ఇతని ప్రవర్తన ఇంట్లోవాళ్ళందరికీ ఆశ్చర్యంగా ఉంది. ఆనందంగానూ ఉంది. బాధ్యతలు పట్టకుండా ఆఫీసే స్వర్గం అనుకొని ఉదయాన్నే ఆరుగంటలకే నిద్రలేచి మజ్జిగన్నం టిఫిన్ బాక్సులో పెట్టుకొని వెళ్ళి రాత్రి పది గంటలకు తిరిగివచ్చే సుందరరావేనా అని.

అంతకంటే ఆశ్చర్యం...ఉదయం పది గంటలకు సుందరరావుకు, తాలూకా ఆఫీసు ప్యూను పీరు సాహెబుకు జరిగిన సంభాషణ...

''మినిస్టరుగా రొచ్చారు. తమర్ని అయ్యగారు పిలవమని చెప్పారు'.''

''ఈ రోజు పబ్లిక్ హాలిడే. నాకు వేరే పనుంది. రానన్నానని చెప్పు.''


ప్యూను ఆశ్చర్యపోయాడు. ''తమరు ...''


''గెటవుట్ ... మినిస్టరొచ్చినా, కలెక్టరొచ్చినా సెలవు రోజు రానన్నానని చెప్పు. దట్సాల్!'' లోపలికి వెళ్ళిపోయాడు సుందరరావు.

తెరిచిన నోరు అలాగే ఉంచి ఆఫీసుకు వెళ్ళాడు ప్యూను.

మరునాటి రోజు సరిగ్గా పది గంటలా ఇరవై తొమ్మిది నిముషాలు దాటి యాభై తొమ్మిది సెకండ్ల ప్రాంతంలో తన సీట్లో కూర్చున్నాడు సుందరరావు.

అప్పటికే సుందరరావు ప్రవర్తన ఆఫీసంతా తెలిసిపోయింది. బక్క చిక్కిన పిల్లిలా ఉండే సుందర





రావు గాయపడిన బెబ్బులిలా ఎందుకు మారాడా అని ఆఫీసులో అంతా ఆలోచిస్తున్నారు. కాని సుందరరావు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

"తమర్ని అయ్యగారు రమ్మంటున్నారు." పీరుసాహెబు చెప్పాడు.

"ఎస్ ... కమింగ్" అంటూ కాలరు కొసర్దుకొని సీట్లోంచి లేచాడు. అతనికి దారి ఇస్తూ ప్రక్కకు తప్పుకొన్నారు ఎదురు వస్తున్న వాళ్ళంతా.

నేరుగా వెళ్ళి తహసీల్దారుకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు అడక్కుండానే. తన కెదురుగా నిలబడడానికే సాహసించని సుందరరావు ఇలా కూర్చొనేసరికి తహసీల్దారు తన ప్రిస్టేజి మంట గలిసినట్లు భావించి దుఃఖాన్ని దిగమింగుకొన్నాడు.

"సుందరరావుగారూ! నిన్న పిలిపించినా మీరు రాలేదు. అందుకని మీకు చార్జి మెమో ఇచ్చి నెల రోజులు సస్పెండ్ చేస్తున్నాను."

"నో ... నో ... దట్ ఈజ్ నాట్ యువర్ బిజినెస్ ... సెలవు రోజు ఆఫీసుకు రాలేదని చార్జి మెమో ఇస్తే దానికి సంజాయిషీ రెడీగా ఉంది. సస్పెండు చేయడం మీ వంతుకాదు. దేర్ ఆర్ రూల్స్. ఆ విషయం కలెక్టరుగారికి సంబంధించినది. అదీ నా సంజాయిషీ, సమంజసంగా లేకపోతేనే సుమా ..." హాపీగా నవ్వాడు సుందరరావు.

"గెటప్ ... అండ్ ... గెటవుట్!" అగ్నిలో ఆజ్యం పోసి దాన్ని విసిరినట్లయింది అతని పరిస్థితి.

"అది ఎన్నటికీ జరగదు."

"నేను తహసీల్దారును. అయామ్ ది తాలుక్ మేజిస్ట్రేట్."

"కావచ్చు ... పెను తుఫానుకు మహావృక్షం సహితం కూకటివేళ్ళతో కూలిపోతుంది. చిన్న ఉద్యోగులం మేమంతా రూల్సు ప్రకారం పోతే మీ పని గోవిందా... టిట్ ... ఫార్ ... టట్!" పెద్దగా నవ్వాడు సుందరరావు.

అప్పటికే ఆఫీసు స్టాఫంతా కిటికీల్లోంచి వినోదం చూస్తున్నారు. హెడ్‌క్లర్కు, డిప్యూటీ తహసీల్దారు తహసీల్దారు రూములోకి వచ్చి గలభా సర్దడానికి ప్రయత్నిస్తున్నారు.

"ఎందుకు పెద్ద మాటలు ... ఏనుగు—గడ్డిపోచలు, పాము—చీమలు ... పులి—బోను కథలు మరొకసారి చదవండి. ఎంతవాడైనా న్యాయానికి తల వంచక తప్పదు."

"ఐ సే డోన్ట్ టాక్!" తహసీల్దారుకు బి. పి. మరీ ఎక్కువై టేబుల్ని గట్టిగా గుద్దాడు. ఆ వూపుకు దానిమీదున్న పేపరు వెయిటు అరడుగు ఎత్తు ఎగిరి ప్రక్కనే ఉన్న డిప్యూటీ తహసీల్దారు పాదం మీద పడింది. దాంతో ఆయన నరాలు జివ్వుమన్నాయి. కోపంతో చుట్టూ చూశాడు. ఎవర్ని తిట్టాలో అర్థం కాక ఏదో అర్జంటు పనున్నట్టు తన రూముకు వెళ్ళి కాలు సర్దుకోసాగాడు.

తహసీల్దారు కోపంలో ఏదేదో అంటున్నాడు. సుందరరావు 'బి ... పొలైట్ ... ఐ సే ... బి పొలైట్' అంటూ మధ్య మధ్య గుర్తుచేయసాగాడు. కాని చివరకు హెడ్ క్లర్కుతో అన్నాడు తహసీల్దారు. "సుందరరావుమీద చార్జెస్ ఫ్రేమ్ చెయ్యండి. అతని ప్రవర్తన బాగాలేదు" హెడ్ క్లర్కు ఎప్పుడెప్పుడా అన్నట్లు తన సీట్లోకి వెళ్ళి చార్జి మెమో వ్రాయసాగాడు.

కొద్దిసేపట్లో సుందరరావుకు చార్జి మెమో ఇచ్చారు. సుందరరావు దానికి సంజాయిషీ వ్రాసి ఇచ్చాడు. చార్జి మెమోకు దాన్ని పెట్టి సుందరరావును నెల రోజులు సస్పెండు చేయాలని కోరుతూ కలెక్టరుకు వ్రాశాడు తహసీల్దారు. నాలుగు రోజుల్లో అదేవిధంగా కలెక్టరునుంచి ఆర్డర్సు వచ్చాయి.

సుందరరావు అప్పట్నుంచి వూరుకోలేదు. ఈ విషయం ప్రతి ఎన్. జి. ఓ. కు వివరించి ఎన్. జి. ఓస్ అసోసియేషన్‌ను తనవైపు తిప్పుకున్నాడు. మిగతా ఎంప్లాయీస్ అసోసియేషన్లన్నీ ఇందులో కలిశాయి. తాలూకా అసోసియేషన్లు డిస్ట్రిక్టు అసోసియేషన్లతో చర్చించాయి. ఈ విషయాన్ని డిస్ట్రిక్ట్ అసోసియేషన్లు స్టేట్ అసోసియేషన్‌కు నివేదించాయి. స్టేట్ అసోసియేషన్ తీవ్రమయిన చర్య తీసుకొంది. సుందరరావు సస్పెన్షనుకు నిరసనగా స్టేటు స్టేటంతా సమ్మెలు, నిరాహార దీక్షలతో నిండిపోయింది. వీరందరికీ సుందరరావు నాయకుడయ్యాడు. క్రమేణా ఈ విషయం ప్రతి ఒక్కరికీ ముఖ్యమై పోయింది. పేపర్లో సుందరరావు పేరు పడని రోజు లేదు. చివరకు ప్రభుత్వ పాలనే స్తంభించిపోయింది.

దానితో గవర్నమెంటు ఒక జి. ఓ. పాసు చేసింది. అయిదుసంవత్సరాలు సర్వీసున్న ప్రతిఉద్యోగికి ప్రమోషనివ్వాలని, సుపీరియర్స్ సబార్డినేట్సును చులకనగా చూడరాదని అందులోని సారాంశం.

ప్రస్తుతం అయిదు సంవత్సరముల సర్వీసు కొ ప్రమోషను చొప్పున బేరీజు వేసి సుందరరావుకు డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగ మిచ్చారు. ఇతని పుణ్యమా అని రాష్ట్ర మంతా వేలు జరిగింది ఇంతకు ముందున్న తహసీల్దారును ఎక్కడికో మారుమూలకు మార్చారు.

ఇప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది సుందరరావు ఆర్థిక పరిస్థితులు కూడా చక్కబడ్డాయి.

• • • •

బయట 'టకటకా' మని చప్పుడయ్యేసరికి తలుపు తీశాడు సుందరరావు. ఎదురుగా ప్యూను పీరుసాహెబు నిలబడి ఉన్నాడు. అయితే అప్పటివరకు తను కన్న తీపి కలను మరిచిపోలేకున్నాడు.

"అయ్యగారు తమర్ని అర్జెంటుగా తీసుకు రమ్మన్నారు."

"అరె ... ఆలస్యమయి పోయిందే" అనుకుంటూ త్వరత్వరగా తయారై ఆఫీసుకు పరుగెత్తాడు పూర్ గుమాస్తా సుందరరావు ఆ రోజు ఆదివార మన్న సంగతే మరిచిపోయి.

"బుద్ధుందటయ్యా! పది గంటలకు మినిస్టరు వస్తూంటే ఎనిమిది గంటలకటయ్యా ఆఫీసుకు వచ్చేది. నేను ఆఫీసు కొచ్చేసరికి నీవు ఆఫీసులో ఉండాల్నా ... వద్దా ..." ఆ రంకెలు విన్న తర్వాత తను అటువంటి కలలు కనడానికి పనికిరానను కున్నాడు పూర్ సుందరరావు.

'చేసేవాడుంటేనే చేయించుకొనే వాడుంటాడు. పడేవాడుంటేనే తిట్టేవాడుంటాడు. బాండెడ్ లేబర్‌ను నిర్మూలించాలంటూనే ప్రభుత్వం ప్రభుత్వంలో ఒక భాగమయిన చిన్న ఉద్యోగస్థులచేత బాండెడ్ లేబర్ చేయిస్తుంది. ఇదేం న్యాయం! ఉద్యోగస్థులలో ఐకమత్యమే ఉంటే ఇలా జరుగుతుందా! ఒంటరిగా నిద్రపట్టని రోజున ఇలా వాపోతుంటాడు సుందరరావు.

*